# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ:  23-06-2025                    సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- సుస్థిరిత ఇకపై నినాదం కాదని అది ఒక అవసరంగా మారిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.

- సాంకేతికత గత 11 సంవత్సరాల్లో భారతవృద్ధికి ఒక చోదక శక్తిగా మారిందని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు.

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగాల సమాహారమైన "వింగ్స్ టు అవర్ హోప్స్" రెండవ సంకలనాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈరోజు విడుదల చేశారు.

- ఇరాన్‌లోని సైనిక స్థావరాలను విజయవంతంగా ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ సైన్యం ధృవీకరించింది.

- కనిష్క బాంబు దాడి బాధితులకు కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి నివాళి అర్పించారు.

====================

పర్యావరణ హితానికి విద్యార్థులు కృషి చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. ఈ రోజు న్యూఢిల్లీలో జరిగిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ICMAI) 2025 స్నాతకోత్సవంలో రాష్ట్రపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ... నేడు ప్రపంచం వాతావరణ మార్పుల సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని ఉద్ఘాటించారు. దీనికి పరిష్కారం సుస్థిరిత అని వ్యాఖ్యానించారు. సుస్థిరిత ఇకపై నినాదం కాదని... అది ఒక అవసరంగా మారిందని రాష్ట్రపతి పేర్కొన్నారు. విద్యార్థులు తమ నైపుణ్యాలతో భవిష్యత్‌లో మార్పు తీసుకురాగలరని అభిప్రాయపడ్డారు. భారత ఆర్థిక వ్యవస్థను నేడు ప్రపంచంలోనే ఒక బలమైన ఆర్థిక వ్యవస్థగా మార్చడంలో ICMAI కీలక పాత్ర పోషించిందని ద్రౌపది ముర్ము మాట్లాడుతూ...

(వాయిస్ 30 సెకన్లు)

====================

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేసిన ప్రసంగాల సమాహారమైన "వింగ్స్ టు అవర్ హోప్స్" రెండవ సంకలనాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈరోజు విడుదల చేశారు. ఈ సంచికలో 2023 ఆగస్టు నుండి 2024 జూలై వరకు రాష్ట్రపతి చేసిన ప్రసంగాలను పొందుపరిచారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఈ కార్యక్రమానికి కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, ఆ శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ... ఈ పుస్తకం వికసిత్ భారత్ లక్ష్యాలను సాధించే దిశగా పని చేయడానికి ప్రజలను ప్రేరేపిస్తుందని అన్నారు. ఈ పుస్తకంలో నాగరికత నుండి సంస్కృతి వరకు, విద్య నుండి ఆరోగ్యం వరకు అనేక అంశాలు ఉన్నాయని చెప్పారు. ఇక అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. ఈ పుస్తకం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంక్షేమ ఆలోచనల గురించి రాబోయే తరాలకు అవగాహన కల్పిస్తుందని అన్నారు. రాష్ట్రపతి ప్రసంగాలలో పేదల అభ్యున్నతికి ఆమె చేసిన కృషిని ఈ సందర్భంగా ఆయన ప్రశంసిస్తూ..

(వాయిస్ 37 సెకన్లు)

====================

డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఈరోజు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయనకు నివాళి అర్పించారు. దేశ సమగ్రతను చెక్కుచెదరకుండా ఉంచడానికి శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అసమానమైన ధైర్యాన్ని ప్రదర్శించారని సామాజిక మాధ్యమం ఎక్స్ లో పేర్కొన్నారు. జాతి నిర్మాణానికి ఆయన చేసిన అమూల్యమైన కృషిని ఎల్లప్పుడూ భక్తితో స్మరించుకుంటామని తెలిపారు.

====================

ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య క్షిపణి దాడులు కొనసాగుతున్నాయి. ఇరాన్ నుండి ప్రయోగించబడిన క్షిపణిని నిలువరించిన కొద్దిసేపటికే ఇరాన్‌పై అనేక వైమానిక దాడులు నిర్వహించామని ఇజ్రాయెల్ సైన్యం ధృవీకరించింది. ఇరాన్‌లోని కెర్మాన్‌షా ప్రావిన్స్‌లోని సైనిక స్థావరాలను విజయవంతంగా ధ్వంసం చేశామని పేర్కొంది. 15 యుద్ధ విమానాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయని తెలిపింది. ఇరాన్ సైతం ఇజ్రాయెల్‌లోకి క్షిపణులు, డ్రోన్‌లను పంపించి దాడులు చేస్తోంది. అనేక నగరాల్లో పేలుళ్ల శబ్దాలు కొనసాగుతున్నాయి. మరోవైపు ప్రపంచంలోని అత్యంత కీలకమైన చమురు గ్యాస్ షిప్పింగ్ మార్గాలలో ఒకటైన హార్ముజ్ జలసంధిని మూసివేయాలనే ప్రతిపాదనను ఇరాన్ పార్లమెంట్ ఏకగ్రీవంగా ఆమోదించింది. అయితే ఈ నిర్ణయానికి ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ తుది ఆమోదం తెలపాల్సి ఉంది.

విరామం

====================

సాంకేతికత గత 11 సంవత్సరాల్లో భారత వృద్ధికి ఒక చోదక శక్తిగా మారిందని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. గత 11 సంవత్సరాలలో శాస్త్ర సాంకేతిక రంగ పురోగతిపై వివరించేందుకు న్యూఢిల్లీలో ఆయన ఈరోజు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి మాట్లాడుతూ... 2014లో కేవలం 50 బయోటెక్ అంకురా సంస్థలు మాత్రమే భారత్ లో ఉండేవని అవి నేడు 10 వేలకు పెరిగాయని చెప్పారు. ప్రపంచంలో 10వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ నుండి నేడు భారత్ 4వ స్థానానికి చేరుకుందని జితేంద్ర సింగ్ పేర్కొంటూ ...

(వాయిస్ 28 సెకన్లు)

====================

కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా రేపు ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో జరిగే 25వ సెంట్రల్ జోనల్ కౌన్సిల్ సమావేశానికి అధ్యక్షత వహించనున్నారు. సెంట్రల్ జోనల్ కౌన్సిల్‌లో ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్,

ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు ఉన్నాయి. ఈ సమావేశంలో ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు ప్రతి రాష్ట్రం నుండి ఇద్దరు సీనియర్ మంత్రులు కూడా పాల్గొంటారు.

====================

కనిష్క బాంబు దాడి జరిగి నేటికి 40 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ ఆ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు. దీనిని అత్యంత దారుణమైన ఉగ్రవాద చర్యల్లో ఒకటిగా ఆయన అభివర్ణించారు. 1985లో ఇదే రోజున, కెనడాలోని మాంట్రియల్ నుండి లండన్‌కు అక్కడ నుండి న్యూఢిల్లీకి వెళ్తున్న ఎయిర్ ఇండియా విమానం 182పై కెనడాకు చెందిన ఖలిస్తానీ ఉగ్రవాదులు చేసిన పిరికిపంద చర్య ఫలితంగా ఐర్లాండ్ తీరంలో అట్లాంటిక్ మహాసముద్రం మీదుగా గగన తలంలోనే విమానం పేలిపోయింది. ఈ ఉగ్ర దాడిలో కెనడాతో పాటూ.. ఇతర విదేశీయులు, అలాగే పిల్లలు సహా అనేక మంది భారతీయ పౌరులు కలిపి మొత్తం 329 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. కేంద్ర పెట్రోలియం సహజ వాయువుల శాఖా మంత్రి హర్దీప్ సింగ్ పూరి ఆయన తన ఎనిమిది మంది సభ్యుల ప్రతినిధి బృందంతో కలిసి ఐర్లాండ్‌లోని కార్క్ లో ఉన్న అహకిస్తా స్మారక చిహ్నం వద్ద కనిష్క బాంబు దాడి బాధితులకు ఈరోజు నివాళులర్పించారు.

(వాయిస్ 32 సెకన్లు)

====================

ఇంగ్లాండ్ లో లీడ్స్ వేదికగా భారత్ ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న తొలి టెస్టు రెండవ ఇన్నింగ్స్‌లో 4వ రోజు టీ విరామ సమయానికి భారత్ జట్టు 4 వికెట్ల నష్టానికి 298 పరుగులు చేసింది. దీంతో భారత్ ఆధిక్యం 304 పరుగులకు చేరుకుంది.

====================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిసాయి. సెన్సెక్స్ ఉదయం 82,408 పాయింట్ల వద్ద భారీ నష్టాల్లో ప్రారంభమై... చివరికి 512 పాయింట్ల నష్టంతో 81,896 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 140 పాయింట్ల నష్టంతో 24,972 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.76గా ఉంది.

====================

రాబోయే రెండు రోజుల్లో ఉత్తర భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో నైరుతి రుతుపవనాలు మరింత ముందుకు సాగడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. వచ్చే శుక్రవారం వరకు దేశంలోని పశ్చిమ ప్రాంతాలలో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. మధ్యప్రదేశ్‌లోని అనేక జిల్లాల్లో వర్షాలు కొనసాగుతున్నాయని  గత 24 గంటల్లో ఆ రాష్ట్రంలోని 25కి పైగా జిల్లాల్లో భారీ వర్షపాతం నమోదైందని పేర్కొంది.

====================
====================